క్లుప్తంగా

ఓటుహక్కును వినియోగించుకోవాలి

రాజాపూర్: గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని రాజాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు ముదిరెడ్డిపల్లి, రాయపల్లి గ్రామాల్లో సెంట్రల్ ఫోర్స్‌తో కవాతు నిర్వహించారు. పార్టీల నాయకులు ప్రజల్ని భయపెట్టి ఓట్లు వేయించుకోవాలని చూస్తే ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఆస్తి పన్ను వసూలులో లక్ష్యం చేరాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) ముగిసేలోపు ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్యం చేరుకోవాలని ఏఎంసీ పవన్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ సిబ్బందితో సమీక్షించారు. కాగా, ఇటీవలే పట్టణంలోని 49వార్డులకు ఒక్కో వార్డు ఆఫీసర్‌ను నియమించారు. వీరంతా కేటాయించిన వార్డులో ఇంటింటికీ తిరిగి ఆస్తి పన్ను మదింపు వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలన్నారు. అలాగే కొత్తగా తెప్పించిన హ్యాండ్ మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఓ నర్సింహులు, ఆర్‌ఐలు ముజీబ్, వీరేందర్, రమేశ్, టి.నర్సింహ, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి శివారులో శుక్రవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రాజాపూర్ పోలీసులు ఓ ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నారు. టిప్పర్ ఎదురుగా రావడంతో కానిస్టేబుల్ శంకర్ ఆపి పరిశీలించగా అందులో ఇసుక లోడ్ ఉందని గుర్తించారు. అనుమతుల గురించి డ్రైవర్‌ను ప్రశ్నించగా అతడు టిప్పర్‌ను అక్కడే వదిలిపారిపోయాడు. దీంతో టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అయితే కాంత్రినగర్ యువకులు ఇసుకలోడ్‌తో వస్తున్న టిప్పర్, లోడ్ చేసిన జేసీబీని అడ్డుకుని డయల్ 100కు సమాచారం ఇచ్చామన్నారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి వచ్చి ఒక కానిస్టేబుల్‌ను అక్కడపెట్టి వెళ్లాడని..టిప్పర్‌ను మాత్రం స్వాధీనం చేసుకుని జేసీబీని వదిలివేశాడని ఆరోపించారు.

బైక్ నుంచి పడి ఇద్దరికి గాయాలు

గండేడ్: బైక్ నుంచి పడి ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. సల్కర్‌పేట్‌కు చెందిన కొండారెడ్డి తన కుమార్తెతో పాటు బైక్‌పై ధర్మాపూర్‌కు బయలుదేరారు. అంతర్‌గంగ సమీపంలో వారి వాహనానికి కుక్క అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. కొండారెడ్డి ముఖానికి, కాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. చందన సైతం గాయపడింది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి

నవాబుపేట: బీఆర్‌ఎస్ నేత, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్, కొల్లూర్‌కు చెందిన డీఎస్‌రావు శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డి, తదితరులు కొల్లూర్‌కు వచ్చి సంతాపం ప్రకటించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మిడ్జిల్: వేముల మాజీ సర్పంచ్ మాలే లక్ష్మీదేవి(58) గురువారం అర్ధరాత్రి అనారోగ్యంతో చికిత్సపొందుతూ హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్..

వేములకు చెందిన అంగన్‌వాడీ టీచర్ ఈదమ్మ(50) శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె మృతి పట్ల మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిన్నచింతకుంట: అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్నా ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఖాళీ బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ఆరబెట్టి తీసుకు రావాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ. 2180 చెల్లిస్తారని వివరించారు. సంఘం సీఈఓ బషీర్, స్టాఫ్ అసిస్టెంట్ గోవిందరాజు, ఏఈఓ శ్రీజ రైతులు పాల్గొన్నారు.

పీయూ జేఏసీ నాయకుల ర్యాలీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బీఆర్‌ఎస్‌ను ఓడించాలని పీయూ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పీయూ పీజీ కళాశాల నుంచి ముఖద్వారం వరకు ర్యాలీ నిర్వహించారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీక్‌ల నుంచి అన్ని పరీక్షల రద్దు వరకు పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేయాలని ప్రజలను కోరనున్నట్లు తెలిపారు. రాము, సురేందర్, హరిప్రసాద్, నవీన్,స్రవంతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- అందు కోసమే వినియోగదారుల దినోత్సవం
- డీఈ కృష్ణమూర్తి


ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఈ కృష్ణమూర్తి

జడ్చర్ల టౌన్: విద్యుత్ సమస్యలను పరిష్కరించడం కోసమే వినియోగదారుల దినోత్సవం నిర్వహించామని జడ్చర్ల డివిజన్ డీఈ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సబ్‌డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఫిర్యాదులు స్వీకరించారు. వినియోగదారుడి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అన్నారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం నిర్వహించామన్నారు. వినియోగదారులు సమస్యలు ఏవి ఉన్నా ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ఫిర్యాదులు సైతం వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. నిమ్మబావిగడ్డపై హనుమాన్ దేవాలయం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కాలనివాసులు డీఈకి వినతిపత్రం సమర్పించారు. సదస్సులో ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు కిరణ్ కుమార్, నరేందర్‌గౌడ్, జ్ఞానసుందర్, మధుశాల, వెంకటయ్య, అరుణ్‌నాయక్, ఏఈఓ హరిచందర్ పాల్గొన్నారు.

పరిశ్రమల వ్యర్థాలు తిని గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

రాజాపూర్: మండలంలోని రాయపల్లి శివారులో గల సెజ్‌లోని పరిశ్రమల నుంచి రాత్రి వేళల్లో వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయడంతో వాటిని తిని శుక్రవారం రాయపల్లికి చెందిన కుర్వ అత్తెల పర్వతాలుకు చెందిన మూడు గొర్రెలు మృతి చెందాయి, మరో 16 గొర్రెలు అనారోగ్యం బారిన పడ్డాయి. యజమాని పర్వతాలు మండల వైద్యాధికారి కార్తీక్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే అక్కడివచ్చి చికిత్స అందించారు. సెజ్‌లోని పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చర్యలు తీసుకోవాల్సిన కోరుతున్నారు.

వ్యర్థాలను చెట్లమాటున వేస్తున్నారు

రాత్రిపూట కంపెనీల నుంచి వ్యర్థాలను, కాలం చెల్లిన మందులను, వస్తువులను బయట పారవేయడంతో గొర్రెలు తిని చనిపోయాయి. రూ.40వేల వరకు నష్టం వాటిల్లింది. కంపెనీల వాళ్లు బయట పారవేయకుంటే నా గొర్రెలు బతికేవి.

– అత్తెల పర్వతాలు, రాయపల్లి

వెంటనే జాగ్రతలు తీసుకోవాలి

గొర్రెల పెంపకందార్లు తమ గొర్రెలను మేతకోసం బయటికి తీసుకెళ్లినప్పుడు ప్లాస్టిక్, ఇతర వస్తువులు తినకుండా జాగ్రతలు తీసుకోవాలి. ముఖ్యంగా గొర్రెలకు ఏదైన రోగం వస్తే వెంటనే సమాచారం ఇస్తే రోగాన్ని గుర్తించి చికిత్స చేస్తాం. ఈ సీజన్‌లో గొర్రెలకు, మేకలకు పారుడు రోగం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

– కార్తీక్ మండల పశువైద్యాధికారి, రాజాపూర్

ప్రజల కష్టసుఖాలు తెలుసు


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తన బాల్యమంతా పాతపాలమూరు లోనే సాగిందని.. ఇక్కడి ప్రజల కష్టసుఖాలన్నీ బాగా తెలుసునని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పాత పాలమూరు, బాలాజీనగర్, శివశక్తినగర్, మేకల బండ తదితర ప్రాంతాల్లో రోడ్ షో నిర్వహించారు. మళ్లీ గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: గతంలో వృద్ధులకు రూ.2 వందలు ఫించన్ వచ్చేదని.. తెలంగాణ ఏర్పాటయ్యాక ప్రస్తుతం రూ.2016 ఇస్తున్నామని.. త్వరలో రూ. 5016 ఇవ్వబోతున్నామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అత్య కుంటతండా, అయోధ్యనగర్, శేక్‌పల్లి, ఎల్లంబాయితండాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కరెంటు కష్టాలు దూరమయ్యాయని, ఇటీవల సాగుకు 3గంటల విద్యుత్ చాలన్న కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని రైతులకు పిలుపునిచ్చారు. ఉచిత విద్యుత్ కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ ఆదరించాలన్నారు. మంత్రికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎల్లంబాయితండాలో గిరిజన మహిళలతో కలిసి ఆయన నృత్యం చేశారు. ఎద్దుల బండితో శేక్‌పల్లి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం మాజీ మంత్రి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములు, రామ్‌లక్ష్మన్, శివరాజు, ప్రభాకర్‌రెడి పాల్గొన్నారు.

పథకాలను కచ్చితంగా అమలు చేస్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ ఓటమి ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాచన్‌పల్లి బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. నాయకులు నర్సింహారెడ్డి, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, లింగంనాయక్, ఆనంద్‌గౌడ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని గోల్‌బావి తండా, హనుమాన్‌టెంపుల్ తండాల్లో యెన్నం ప్రచారం నిర్వహించారు.


పార్టీలో చేరిన వారితో యెన్నం తదితరులు

హన్వాడ: బీఆర్‌ఎస్ నాయకుల మాటలు.. తాతకు దగ్గు నేర్పినట్లున్నాయని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం పిల్లిగుండుతండాలో మాట్లాడారు. వైఎస్సార్ హయాంలో రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఘనత తమదేనన్నారు. బీఆర్‌ఎస్ వచ్చాక రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నారు. ఆయన సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. జిల్లా నాయకుడు అమరేందర్‌రాజు, మండల అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

భూత్పూర్: కర్వెనకు చెందిన కురుమ సంఘం అధ్యక్షుడు పిండి శేఖర్ అనారోగ్యంతో మృతిచెందారు. విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం గ్రామానికి కరన్న ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డెయిరీ వద్ద పాడి రైతుల ధర్నా

- పాలను పారబోసిన వైనం


ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీ వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ డెయిరీ వద్ద రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. నవాబుపేట మండలంలోని దొడ్డిపల్లి, కూచూరు గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఎత్తివేయటంతో ఇక్కడకు వచ్చి ఆందోళన చేపట్టారు. నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. పాల వాహనాలను రాకుండా అడ్డుకున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి పాలు తీసుకువచ్చే వాహనాలు బయటే నిలిచిపోయాయి. మూడు నెలల కిందటి వరకు జడ్చర్లలోని ప్రైవేట్ డెయిరీ కి పాలు పోసేవారమని, అక్కడ కాకుండా విజయ డెయిరీ కి పోయడం ప్రారంభించామని రైతులు అన్నారు. మొదటి రెండు నెలలు సవ్యంగానే బిల్లులు ఇచ్చినప్పటికీ మూడవ నెల బిల్లు ఇంకా చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పాలను యథావిధిగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన యిరీ నిర్వాహకులు అధికంగా రావటం వల్ల పాలు తీసుకోవటం లేదన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే సేకరణ నిలిపివేశామన్నారు. కాగా తమకు పాలతోనే బతుకుదెరువు ఉందని, తప్పనిసరిగా తీసుకోవాలని రైతులు ఆందోళన కొనసాగించారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు జిల్లా అధికారులతో మాట్లాడి పాలు తీసుకునేందుకు అంగీకరించచారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ఆందోళన కారణంగా డైరీకి తీసుకువచ్చిన పాలు పాడవటంతో అక్కడే పారబోసి వెళ్లారు.

విద్యార్థులకు పురస్కారాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎంఆర్‌వీ ప్రసాద్, ఎంఏ భవానీ స్మారక ట్రస్ట్ సహకారంతో భౌతికశాస్త్రంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చైర్మన్ నారాయణ బంగారు పతకాలు, నగదు పురస్కారాలు అందజేశారు. కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రావు, భౌతికశాస్త్ర విభాగ అధిపతి ఉదయ్‌కుమార్, అధ్యాపకులు డా.మంజుల, ప్రవీణ్, సాయికొండలు, రామకృష్ణ, సింధు, మాధవి పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ కోఆర్డినేటర్‌గా సత్యనారాయణగౌడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్‌గా సత్యనారాయణగౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన ఆయనను ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

బీజేపీ నాయకుల రాజీనామా

జడ్చర్ల టౌన్: బీజేపీ జడ్చర్ల అభ్యర్థిగా స్థానికుడిని కాకుండా చిత్తరంజన్‌దాస్‌కు టికెట్ ఇవ్వడంతో ఆ పార్టీ నాయకులు పలువురు రాజీనామాలు చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రమేష్ జీ, పెద్ద ఆదిరాల సర్పంచ్ కృష్ణాబాయితోపాటు మరికొందరు రాజీనామా ప్రకటించారు.

వైఎస్సార్‌టీపీకి..

దేవరకద్ర: వైఎస్సార్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి ఆ పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

జీవితాల్లో నిప్పులు పోశారు

గండేడ్/మహమ్మదాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దలు నిరుద్యోగుల జీవితాల్లో నిప్పులు పోశారని గండేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిన్నారం, చెల్మిల్ల గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దస్తయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ మండలంలో అధ్యక్షుడు కేఎం నారాయణ, నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతీబాయి పాల్గొన్నారు.

చెక్‌డ్యాంను తొలగించాలి

చిన్నచింతకుంట: మండలంలోని ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారులు చర్యలు చేపట్టాలని.. లేనిచో ఈనెల 5, 6 తేదీల్లో చింతకుంట బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ కన్వీనర్ కుర్వరమేష్, మండల అధ్యక్షుడు దశరత్, నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

దేవరకద్ర: నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలని దేవరకద్ర ఈఆర్‌ఓ నటరాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. శుక్రవారం మొదటి రోజు నామినేషన్లు ఎవరూ వేయలేదని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రమణారెడ్డి, నోడల్ అధికారి రవీంద్రనాథ్, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల వేళ రోడ్డు మరమ్మతు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని సిగ్నల్‌గడ్డపై ఎట్టకేలకు బీటీరోడ్డుకు మరమ్మతు నిర్వహించారు. 167వ నెంబరు జాతీయరహదారిపై సిగ్నల్‌గడ్డ వద్ద రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా బీటిరోడ్డు పాడైనప్పటికీ మరమ్మతు చేపట్టడం లేదు. తాత్కాలికంగా ప్యాచ్‌వర్క్ చేసినప్పటికీ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. అయితే సార్వత్రిక ఎన్నికలు రావటం, సిగ్నల్‌గడ్డపైనే ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉండటంతో పాతబస్టాండ్ మార్గంలో ఒకవైపు మార్గాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు మూసి వేయాల్సి వస్తోంది. ఈ కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని భావించిన అధికారులు సిగ్నల్‌గడ్డ రోడ్డుపై బీటీ వేసేందుకు నిర్ణయించారు. శుక్రవారం సాయంత్రం రైల్వేట్రాక్ నుంచి ఎల్‌ఐసీ కార్యాలయం వరకు రోడ్డుపై బీటీ వేశారు. అదే విధంగా హైస్కూల్ ప్రహరీకి ఆనుకుని ఉన్న తోపుడుబళ్లను సైతం తీయించటంతో రోడ్డు విశాలంగా మారింది. పాతరోడ్డుపై బీటీవేయటం, రోడ్డుకిరువైపులా మట్టి చదును చేయటంతో కొంత సమస్య తీరినట్టిందని స్థానికులు అంటున్నారు.

పనిచేసే వారికి పట్టం కట్టండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సాక్షినెట్‌వర్క్: పనిచేసే వారికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిడ్జిల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. నియోజకవర్గంలో అక్కడక్కడా మిగిలిన పనులను ఎన్నికల తర్వాత పూర్తిచేస్తామన్నారు. ఎంపీపీ సుదర్శన్, నాయకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుక్రవారం జడ్చర్లలోని 11వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జడ్చర్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరో సోమాలియా అవుతుందేమో


మాట్లాడుతున్న చిత్తరంజన్‌దాస్

జడ్చర్ల టౌన్: తెలంగాణ మరో సోమాలియాలా అయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, జడ్చర్ల బీజేపీ అభ్యర్థి చిత్తరంజన్‌దాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిగులుబడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల తెలంగాణాగా మార్చారని, ఉన్న భూములు అమ్ముకున్నారన్నారు. ఎన్నికల తరువాత అమ్ముకోటానికి ఏమీ ఉండవన్నారు. జడ్చర్లలో రాహుల్‌గాంధీ నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రాంతీయపార్టీ కన్నా హీనంగా మాట్లాడారని, ఆయనకు రాజకీయ పరిణితి లేదన్నారు. తనను గెలిపిస్తే కల్వకుర్తిలో మాదిరిగా ఇక్కడా అభివృద్ధి చేస్తానన్నారు. మాజీ సర్పంచ్ సీతారాం, యం.బి బాలకృష్ణ, ప్రతాప్‌రెడ్డి, సామల నాగరాజు, కౌన్సిలర్‌కుమ్మరి రాజు పాల్గొన్నారు.

మరోమారు ఆశీర్వదించండి


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి మంజుల

సాక్షినెట్‌వర్క్: బీఆర్‌ఎస్‌ను మరోమారు ఆశీర్వదించాలని గండేడ్ ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు పెంట్యానాయక్ అన్నారు. శుక్రవారం వెన్నాచేడ్, గండేడ్, బల్సూర్‌గొండ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ చైర్మన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండలో పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు ప్రచారం కొనసాగించారు. కుమ్మరిరాజు, ఆర్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌లో అధ్యక్షుడు భిక్షపతి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, అంజి పాల్గొన్నారు.

బాలానగర్ మండల పరిధిలో ఎంపీపీ కమల, జెడ్పీటీసీ కల్యాణి, వైస్ ఎంపీపీ వెంకటచారి, యువత అధ్యక్షుడు సుప్ప ప్రకాష్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

దేవరకద్ర మండల కేంద్రంలో అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, బాల్‌రాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి ఆల మంజుల శుక్రవారం రాత్రి ఇంటింటి ప్రచారం చేపట్టారు.

రాత్రి గులాబీ వనంలో.. పగలు చేతిలో చెయ్యేసి..


గురువారం రాత్రి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న జాంగీరప్ప


శుక్రవారం ఉదయం కుంభం శివకుమార్‌రెడ్డితో..

ఎన్నికల వేళ కొందరు రోజుకో కండువా మార్చి చేస్తున్న హంగామాతో రాజకీయ రంగం రసవత్తరంగా మారుతోంది. రాత్రికి ఒక పార్టీ.. ఉదయం మరో జెండా.. మధ్యాహ్నం ఇంకో కండువాతో కనిపిస్తున్నారు. ఎవరు ఏ పార్టీకి మారుతున్నారో స్పష్టంకాక కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. కోయిలకొండ మండలం నల్లవల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త జాంగీరప్ప గురువారం రాత్రి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. రాత్రికి రాత్రే మనసు మార్చుకుని శుక్రవారం ఉదయం కుంభం శివకుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

– కోయిల్‌కొండ

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి


పార్టీలో చేరుతున్న వెంకట్‌రెడ్డి తదితరులు

కోయిల్‌కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వీరంపల్లి నాయకులు, గంగ్యానాయక్ తండా సర్పంచ్ రెడ్యానాయక్, మాజీసర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, కేశ్వాపూర్‌లో నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. విద్యాసాగర్‌గౌడ్, రవీందర్, బండియాదవ్ కుమార్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు: నారాయణపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తామని కోయిలకొండ మండల సింగిల్ విండో మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వీరంపల్లిలో వెంకట్‌రెడ్డితో పాటు ఇతర పార్టీల కార్యకర్తలు భారీసంఖ్యలో శుక్రవారం కుంభం శివకుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.